క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట, మల్లెల గ్రామపంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఎమెల్యే పర్యటనలో అందిన ఫిర్యాదులు, సమస్యలపై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. ఆదివారం చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీల్లో... గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు కందికోట తిరుమలేష్(35) ఒక సంచిలో రూ.2,500 విలువ చేసే మూడు ఫుల్ బాటిల్స్ కర్నాటక మద్యంను తరలిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఎస్టీయూ ఉపాధ్యక్షుడిగా అమరనాథరెడ్డి

ములకలచెరువు: మదనపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అమరనాథరెడ్డిని ఎన్నుకున్నారు. అతడి ఎంపిక పట్ల మొలకలచెరువు ఎస్టీయూ నాయకులు సుబ్బారాయప్ప, నౌషాద్, ఉమ శంకర్ రెడ్డి,రామాంజులు, గోపినాథ్, గంగాద్రి, రాజారెడ్డి, శ్రీనివాసులు, ఉమ్మడి రమణ, రహంతుల్లా, కట్ట రవనప్ప, కృష్ణారెడ్డి, ప్రభాకరరెడ్డి, భాస్కర్ రెడ్డి, సోముశేఖర్ రెడ్డి, పూల సుధాకర్, రఘునాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

నాటుసారా పట్టివేత

పెద్దమండ్యం: విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 50 లీటర్ల నాటుసారాను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గోనుపోతులతండాకు సమీపంలో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బంది దాడులు చేయడంతో రామానాయక్‌తండాకు చెందిన శీనునాయక్ నాటుసారాను వదిలేసి పరారైనట్లు చెప్పారు. అక్కడ విక్రయానికి సిద్ధంగా ఉన్న 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే సారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని మంచూరు సచివాలయం పరిధిలోని శాఖంవారిపల్లి హరిజనవాడ, శాఖలంవారిపల్లి, పెరుమల్లయ్యగారిపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ తెలిపారు. కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, గడప గడపకూ పర్యటించి, పరిష్కార సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

పాపేపల్లెలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లె, అవికేనాయక్‌తండా గ్రామాలలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలపై అధికారులు వివరించారు. అలాగే ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలు, వాటి లబ్ధిగురించి అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డీటీ గౌరీశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్, ఈవోపీఆర్‌డీ జనార్ధన్, ఏపీఏ మురళి, వాటర్‌షెడ్ పీఓ రవీంద్ర, సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ గీత, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. సుండుపల్లె మండలం ఫించాకు చెందిన ముబారక్ (45) వ్యక్తిగత పనులపై నిమ్మనపల్లె మండలం అగ్రహారంకు వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరగా, అగ్రహారం సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో ముబారక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవత చేయూత

చిట్వేలి : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున ఆదివారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చిట్వేలిశాఖ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అనుంపల్లికి చెందిన మాదినేని చంద్రశేఖర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిట్వేలికి చెందిన ఆవుల జయమ్మకు రూ. 5 వేలు మొత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- సచివాలయాల భవనాలు, ఆర్‌బీకే కేంద్రాలు ప్రారంభం
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే గ్రామాల్లో కోట్ల రూపాయలతో అత్యాధునిక వసతులతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మిస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి, చారావాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే చింతల చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర వాటి ద్వారా అన్ని వర్గాలకు గ్రామస్థాయిలోనే సేవలు అందుతుంటే ప్రతిపక్షాలు మాత్రం అభివృద్ధి లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామాల్లోనే పాలన సాగిస్తూ పేదల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయిన సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓటమి భయంతోనే ప్రతిపక్ష నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా పేదలకు ఇంటికే పథకాల లబ్ధి చేరుతుందని, రైతులకు గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు పచ్చనేతలు చెప్పినవారికే వచ్చేవని గుర్తు చేశారు. పేదలకు అందే పథకాలన్నీ కొనసాగాలంటే మరోసారి మన సంక్షేమ సారథి జగన్మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అవ్వాతాత, అక్కచెల్లమ్మల మోములో ఆనందం నింపేందుకు పింఛన్‌ను కూడా రూ.3వేలకు పెంచి ఇస్తున్నారన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి సచివాలయాన్ని ప్రారంభించారు. అలాగే చింతపర్తిలో 116 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇంటి పట్టాలు, 50మంది అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. అలాగే చింతపర్తి పురవీధుల్లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, వైఎస్సార్ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, జడ్పీటీసీ నిర్మల, వైస్ ఎంపిపిలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, ఓరుగంటి రమేష్, చింతల వెంకట్రమణారెడ్డి, పారుఖ్, లక్ష్మీనారాయణ రెడ్డి, మెంబరు శీనా, ముబారక్, శ్రీనాథ్, పద్మనాభరెడ్డి, మహేంద్ర రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ప్రియరంజన్ రెడ్డి, సుధాకర, భాస్కర, నాగరాజ, శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, చెంగల్ రెడ్డి, నల్లంకి నరసింహులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవం విజయవంతం

- సత్తా చాటిన తొగటవీర క్షత్రియ కులస్థులు
- పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ



బస్టాండ్ వద్ద ర్యాలీగా వెళుతున్న తొగటవీర క్షత్రియ కులస్థులు

మదనపల్లె : తొగటవీర క్షత్రియసంఘం వనభోజన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తొగటవీర క్షత్రియ కులస్థులు సత్తాచాటుకున్నారు. ఆదివారం ఉదయం స్థానిక చౌడేశ్వరి దేవాలయానికి చేరుకున్న తొగటవీర క్షత్రియ కులస్థులు పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. చౌడేశ్వరి దేవాలయం నుంచి రామారావుకాలనీ, అంబేడ్కర్ సర్కిల్, సీటీఎంరోడ్డు, టౌన్‌బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్ మీదుగా నీరుగట్టువారిపల్లె, విశ్వం కళాశాల సమీపంలోని మల్లయ్యకొండ వరకు బైక్ ర్యాలీ సాగింది. వందల సంఖ్యలో తొగటవీర క్షత్రియ కులస్థులు, యువకులు నినాదాలు చేసుకుంటూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మల్లయ్య కొండ శివాలయ ఆవరణలో వనభోజన మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, మహిళలచే లలితాసహస్రనామ స్తోత్ర పారాయణం, ఆటలపోటీలు ఆకట్టుకున్నాయి. వనభోజనాల అనంతరం జరిగిన చర్చావేదికలో, తొగటవీర క్షత్రియ కులస్థులు అందరూ ఐకమత్యంగా కులాభివృద్ధికి కృషిచేయాలని తీర్మానించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ కులస్థులు ఎన్నికల్లో పాల్గొంటే.. పార్టీలకు అతీతంగా గెలుపుకు కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియసంఘం అధ్యక్షులు ఉప్పురామచంద్ర, ఉపాధ్యక్షులు ఆర్.నీలకంఠ, శ్రీరామ్‌చినబాబు, తొగటవీరక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శీలంరమణమ్మ, శీలంరమేష్, బండిమనోహర్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఎస్వీ.రమణ, ఎం.వి.రమణ, రామిశెట్టిశివయ్య, భువనేశ్వరిసత్య, మోడెం సిద్ధప్ప, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, లోకేష్, బొమ్మిశెట్టికృష్ణమూర్తి, చౌడేశ్వరిదేవి యువజన సేవాట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్.వెంకటేష్ నార్నవరం, ఉప్పుశ్రీనివాసులు, కొరమట్ల దీపక్‌కుమార్, బండి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్

తంబళ్లపల్లె: లక్ష్మీపురంలో డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రైనేజీ నిర్మాణ విషయమై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కోరగా రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. సర్పంచు శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్‌ల ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్ పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మట్లవారిపల్లెలో ఆత్మీయ సభలో పూర్వ విద్యార్థులు

రామసముద్రం: మండలంలోని మట్లవారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 2004-2005 సంవత్సరం బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సుమారు 48 మంది విద్యార్థులు ఇందులో పాల్గొని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్ల క్రితం పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను మరువకుండా గుర్తించుకొని, ఉపాధ్యాయులను అందరిని ఒకచోట చేర్చి సన్మానించడం నాడు విద్యార్థులు అలవర్చుకున్న క్రమశిక్షణకు , గురువులపై ఉన్న భక్తి భావనకు నిదర్శనమన్నారు. అలాగే పలువురు విద్యార్థులు ఉన్నతమైన వృత్తి , పదవులలో ఉండటం తమకెంతో గర్వకారమని తెలిపారు. అనంతరం ఈ పాఠశాల క్రీడాకారులకు పూర్వపు విద్యార్థుల తరపున క్రీడాపరికరాలు, క్రీడాదుస్తులు , ల్యాప్‌టాప్, విద్యుత్‌చార్జ్ తీగలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళ, కుమారి, ఉమాదేవి, దామోదరం, శ్రీనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, రెడ్డి, అన్సర్‌బాష, డి.దామోదరం, నర సింహులు, ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్త సేవా సమితి ప్రతినిధులు

రాజంపేట టౌన్ : అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను ఆదివారం శ్రీరామభక్త సేవా సమితి ప్రతినిధులు ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో ఈనెల 22వ తేదీ బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని పురస్కరించుకొని దేశంలోని అన్ని ప్రాంతాల్లో హిందువుల ఇళ్లకు స్వామివారి చిత్రపటం, అక్షింతలను రామభక్తులు పంపిణీ చేస్తున్నారన్నారని తెలిపారు. అందులో భాగంగా పట్టణంలో ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. అలాగే ప్రధాని మోదీ పిలుపుమేరకు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ రోజు రాత్రి హిందువులు తమ ఇంటిముంగిట దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామభక్త సేవా సమితి ప్రతినిధులు ఏ.శంకర్‌రాజు, డి.హరిగోపాల్‌నాయుడు, భారతి, ఆవుల సూర్యరంగనాయకులు, ఎం.పుష్పలత, రంగారావు, శివారెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి

కలికిరి: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి సి.సురేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం కలికిరిలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి విశ్రాంత ఉద్యోగి లైఫ్ సర్టిఫికెట్‌లను పూరించాలని కోరారు. ఈ నెల 26న సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని తీర్మాణించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు ఆదినారాయణరెడ్డి, అబ్దుల్ ఖాదర్, డి.మోహన్ కుమార్‌రెడ్డి, మస్తాన్ ఖాన్, దేవేంద్ర, రామచంద్రయ్య, నాగయ్య, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీగా దేవులపల్లి వెంకటరమణారెడ్డి



మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్‌జడ్జ్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా నియామక ఉత్తర్వులు అందినట్లు దేవులపల్లె వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... మదనపల్లె కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న తాను మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఇన్‌చార్జ్‌గా, ఏపీపీగా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. సందర్భంగా ఆయనకు పట్టణంలోని న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆలయ పనులకు భూమిపూజ

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె సమీపంలో మాండవ్యా నది ఒడ్డున వెలిసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ నిర్వహించారు. ఈ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇక్కడ ఉన్న పాత ఆలయాన్ని తొలగించారు. అందులో భాగంగా ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఈ గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, కాంట్రాక్టర్ సహదేవరెడ్డి, వేదపండితులు, భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం రెడ్డివారి పల్లె పంచాయతీ పాటుమీదపాలెం ఎస్టీ కాలనీకి ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో కొత్త బోరు వేసి మోటారు బిగించి తక్షణమే తాగునీటిని అందించారు. గిరిజనులు చెప్పిన వెంటనే సమస్య తెలుసుకుని తాగునీరు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ విప్ కొరముట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలెంకోట రత్నమ్మ, రాజేంద్ర, క్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల పిచికారీపై డెమో

చిన్నమండెం : మండల పరిధిలోని కలిబండ, పడమటికోన గ్రామాల్లో ఆదివారం వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించారు. అలానే డ్రోన్ ద్వారా పొలాల్లో మందులు పిచికారీ చేసే విధానాన్ని డెమో ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఏఓ గీత, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లె పంచాయతీలో ఆదివారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సహకారంతో తురకపల్లిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ దీపాలు లేక చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ విజయారావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సహకారంతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు.

అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో డి.వి.రమణయ్య 23వ వర్ధంతి సందర్భంగా దాత రాజేశ్వరి ఆదివారం మండలంలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం ఆశ్రమంలో అన్నదానం చేసినట్లు హరినాథరెడ్డి తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో నీటి సమస్య పరిష్కారం



జిల్లా ఆస్పత్రిలో నూతన బోరుకు మోటార్ అమర్చి నీటిని వదిలిన మేఘా సిబ్బంది

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కొంతకాలంగా నెలకున్న నీటిసమస్యకు పరిష్కారం లభించింది. జిల్లా ఆస్పత్రిలో నీటికొరతతో రోగులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్న విషయంపై రెండువారాల క్రితం సాక్షిలో జిల్లా ఆస్పత్రిలో నీటి కటకట శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం మదనపల్లె మెడికల్ కళాశాలకు సంబంధించి మేఘా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణపనులకు మేఘా సంస్థ ఆస్పత్రిలోని బోరునీటిని వాడుకోవటంతో నీటివినియోగం అధికమై సమస్య ఏర్పడింది. దీంతో మెడికల్ సూపరింటెంట్ డాక్టర్. పద్మాంజలి అభ్యర్థన మేరకు... మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా జిల్లా ఆస్పత్రికి నీటిని తరలించినప్పటికీ, సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ నీటిసమస్య పరిష్కారానికి ముందుకు వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలో రూ.4.75లక్షలతో కొత్తగా బోరును డ్రిల్ చేశారు. 675 అడుగుల లోతులో దాదాపు 2 ఇంచీలకు పైగా నీరు సమృద్ధిగా పడటంతో పైప్‌లైన్, మోటార్ అమర్చి ఆదివారం ఆస్పత్రికి నీటిసరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో మేఘా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ మేనేజర్ కమలాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



జూనియర్ బాలుర హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో ఆదివారం అన్నమయ్య జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికకు సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో 12 మందిని ఎంపిక చేశారు. ఈనెల 9న తిరుపతిలో జరిగే అంతర్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని శాప్ కోచ్ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ప్రసాద్, కోచ్ శివప్రసాద్, కార్యదర్శి నౌషాద్,జాయింట్ సెక్రటరీ నరేష్‌బాబు, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

జిల్లా జూనియర్ హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలకు కార్యదర్శి నౌషాద్ ప్రకటించారు. అఖిల్ వెంకట్ (కెప్టెన్0, తరుణ్‌రెడ్డి, విష్ణువర్ధన్, డానిష్, హర్షప్రీత్, లీలా, రవితేజ, కిరణ్, రిషికేశవ్, నికిలేష్, గణేష్, గౌతమ్, ప్రియదర్శన్, రెడ్డి జయప్రకాష్, పార్థు, సుశాంత్, వెంకట్‌సాయి, వెంకట్ మురళి, స్టాండ్‌బైలుగా వరుణ్‌కుమార్, రోహిత్, చాణుక్యసాయి, జయకృష్ణ ఎంపికయ్యారు.

శ్రీరాముడి శోభాయాత్రకు నీరాజనాలు



శోభాయాత్రకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : శ్రీరామచంద్రుల వారి జన్మభూమి అయోధ్య రామ మందిరం నిర్మాణం పూర్తి చేసుకొని, జనవరి 22వ తేదీన జరగబోవు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రకు భక్తులు ఆదివారం నీరాజనాలు పలికారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఎర్రచెరువు కట్టపై వెలసిన ఆంజనేయస్వామి ఆలయం నుంచి నిర్వాహకులు డాక్టర్ అరిగె రాంప్రసాద్, పోతురాజు మస్తానయ్య, ఎంబలూరు నరసింహస్వామి, హెచ్‌డీ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో డీసీఎం రోడ్డు, అరవపల్లి మీదుగా శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం వరకు బాణసంచా, భజనలు, కోలాటాల మధ్య శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ముందుగా గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభా యాత్రలో సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం యాత్రలో పాల్గొన్న భక్తులకు సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా శోభాయాత్రలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, బీజేపీ పార్లమెంటరీ నాయకులు సాయి లోకేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, జనసేన నాయకులు ఎల్లటూరు శివరామరాజు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, భక్తులు, మహిళలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

వ్యవస్థలను బాబు నాశనం చేశారు

– ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

రాయచోటి : అందరికీ సమ న్యాయం చేయాల్సిన వ్యవస్థలను చంద్రబాబు పాలనలో మేనేజ్ చేసి నాశనం చేశారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం పీడీఆర్ కల్యాణ మండపంలో జరిగిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి పనులలోను బాబు, అతని అనుయాయులు కోర్టులో వ్యాజ్యాలు వేసి పేదలకు అందకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పథకాలపై కూడా కోర్టుల్లో కేసులు వేసి ప్రజలకు పథకాలు దక్కకుండా చేశారని విమర్శించారు.

వైఎస్ఆర్‌సీపీకి న్యాయవాదుల సహకారం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి న్యాయవాదుల సహకారం ఉండాలని రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు న్యాయవాదుల సహకారం కావాలని కోరారు. ముఖ్యమంత్రిగా మరోసారి గెలుపొందేందుకు వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతం చేసేందుకు న్యాయవాదులు సిద్ధం కావాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం పథకం ప్రవేశపెట్టకపోయినా జగనన్న మాత్రమే లా నేస్తం పథకం పెట్టి జూనియర్ న్యాయవాదులను ఆదుకున్నారని అన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.25 కోట్ల నిధులను విడుదల చేశారని చెప్పారు. అనేక కమిషన్‌లలో న్యాయవాదులకు సభ్యులుగా నియమించారని అన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రతి నియోజకవర్గంలో నలుగురు న్యాయవాదులకు ఎన్నికల నిమిత్తం లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎన్నికల శిక్షణను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి ఎం.ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు విసి రెడ్డప్పరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు దశరథరామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సుదర్శన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సింగారయ్య, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాయల్పాడు, మదనపల్లె, తంబళ్లపల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా..



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. అలాగే మొక్కులు తీరిన పలువురు భక్తులు ఆలయం వద్ద అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. హిందువులతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేయడం గమనార్హం.